అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

సంపుటి - 2 సంచిక -308 మంగళవారం 10 మార్చి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

**క్రూడ్ డబుల్ షాక్..**

**పెరగనున్న విమాన టికెట్లు, పెయింట్స్ రేట్లు**



క్రూడ్ ధరల పెరుగుదల వల్ల ఏవియేషన్, పెయింట్స్ రంగాలు భారీగా నష్టపోయాయి. ఇండిగో, ఏషియన్ పెయింట్స్ వంటి సంస్థల నిర్వహణ వ్యయం పెరిగి, సామాన్యులపై భారపడే అవకాశం ఉంది.

WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

## 25 రోజుల తర్వాతే గ్యాస్ బుకింగ్



**న్యూఢిల్లీ,మార్చి9 (జర్నలిస్ట్ వార్త):**
25 రోజుల తరువాతే గ్యాస్ రీ ఫిల్ బుకింగ్ చేసుకోవాలని కేంద్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దేశంలో నెలకొన్న గ్యాస్ కొరతతో సిలిండర్ బుకింగ్ వ్యవధిని పెంచుతున్నట్లు పేర్కొంది. ఇప్పటివరకూ 21 రోజుల తరువాత రీఫిల్ బుక్ చేసుకోవచ్చుననే నిబంధన ఉంది. ఆ నిబంధనను కేంద్రం సవరించింది. రీ ఫిల్ బుకింగ్ గడువును 25 రోజులకు పొడిగించడం ద్వారా ప్రభుత్వం బుకింగ్‌లను నియంత్రిస్తోంది. పూర్తిస్థాయిలో గ్యాస్ నిల్వలు ఉన్నాయని చెబుతోన్న కేంద్రం మరోవైపు బుకింగ్ సమయాన్ని అమాంతం పెంచడం గృహ వినియోగదారులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో 55 రోజులకోసారి బుక్ చేసుకునేవారు సైతం ప్రస్తుత పరిస్థితుల్లో 15 రోజులకే బుకమిగతా 2లో...



# ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు

### పోలీస్ ఆఫీసర్స్ రీట్రీట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

**సాయం కోసం ప్రజలు పోలీసుల వైపే చూస్తారు**

**ప్రజలకు మీరున్నారనే ధైర్యం ఇందుకు కారణం**

**నేరాల తీరు మారి..సైబర్ క్రైమ్ పెరిగింది**

**నేరాల తీరుకు అనుగుణంగా పనితీరు మార్చుకోవాలి**



హైదరాబాద్,,**మార్చి9 (జర్నలిస్ట్ వార్త):**
ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి పోలీస్ అధికారులు చేస్తున్న కృషిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. మనం ఎక్కడున్నామోతెలిసుకోగలిగితే మనం ఎక్కడికి చేరుకోవాలో తెలుస్తుందన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్-2026 కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ రిట్రీట్ కార్యక్రమం ద్వారా సమస్యలు, పరిష్కారాలపై విశ్లేషించుకున్నట్లు సిఎం తెలిపారు. ఛాలెంజ్ లు రెండు రకాలు.. ఒకటి టెక్నికల్ ఛాలెంజ్, రెండోది అడాప్టివ్ఛాలెంజ్ అన్నారుమిగతా 2లో...

## శాంతివైపే..

**చర్చలు, దౌత్యానికే ప్రాధాన్యత**

**భారతీయుల భద్రతే ముఖ్యం**

**పశ్చిమాసియాలో పరిణామాలపై పార్లమెంట్‌లో మంత్రి జై శంకర్ ప్రకటన**



**న్యూఢిల్లీ, మార్చి9 (జర్నలిస్ట్ వార్త):**
శాంతికే భారత్ ఎల్లప్పుడూ కట్టుబడి వుంటుందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ స్పష్టం చేశారు. చర్చా, దౌత్య వేదికలకు ప్రాధాన్యత నివ్వాలన్నది భారత్ అభిమతమని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిణామాలపై సోమవారం ఆయన పార్లమెంట్ ఉభయ సభల్లో ఒక ప్రకటన చేశారు మిగతా 2లో....

## కాల్పుల విరమణకు ఇరాన్ 'నో'

**ఇరాన్ సుప్రీం నేతగా మొజ్తాబా ఖమేనీ**


**నూతన సుప్రీం నేతకు పుతిన్ అభినందనలు**

**మొజ్తాబాపై దాడులు చేస్తే వ్యతిరేకిస్తాం : చైనా**

**నెతన్యాహుతో చర్చించాకే ముగింపుపై నిర్ణయం : ట్రంప్**



**న్యూఢిల్లీ,,మార్చి9 (జర్నలిస్ట్ వార్త):**
అయతొల్లా మొజ్తాబా ఖమేనీ ఇరాన్ నూతన సుప్రీం నేతగా నియమితుడైన తర్వాత ఇజ్రాయిల్ సోమవారం క్షిపణి దాడులను ముమ్మరం చేసింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. టెహ్రాన్, ఇస్ఫహాన్, దక్షిణమిగతా 2లో...



## కవిత, కేజ్రీవాల్ కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

**సీబీఐ కేసులో నిందితులను విముక్తి చేసిన రౌస్ అవెన్యూ కోర్టు**

**కోర్టు తీర్పును ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసిన సీబీఐ**

**రివిజన్ పిటిషన్ పై వివరణ ఇవ్వాలంటూ నిందితులకు హైకోర్టు నోటీసులు**

**న్యూఢిల్లీ, మార్చి 9**
దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ మళ్లీ కీలక మలుపు తిరిగింది. ఫిబ్రవరి 27న రౌస్ అవెన్యూ కోర్టు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, కల్వకుంట్ల కవిత సహా మొత్తం 23 మందిని ఈ కేసు నుండి విముక్తి చేస్తూ తీర్పును వెలువరించిన సంగతి తెలిసిందే. మిగతా 2లో...

## తెలంగాణ నుంచి ఇద్దరు రాజ్యసభకు ఏకగ్రీవం

### ధృవీకరణ పత్రాలు అందచేత



**హైదరాబాద్,మార్చి9 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ నుంచి నామినేషన్ దాఖలు చేసిన ఇద్దరు అభ్యర్థులు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి సోమవారం ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ తరపున వేం నరేంద్ర రెడ్డి, మిగతా 2లో...

## 'ఫైళ్ల దహనం' తీవ్రమైన నేరం

**రికార్డ్ రూమ్‌లో మంటలెలా వచ్చాయి?**

**మదనపల్లిలో ఫైళ్ల దహనం కేసులో నిందితులకు సుప్రీంకోర్టు షాక్**

**దీని వెనుక ఉన్న ప్లాన్ ఏమిటి? పోలీసులు లోతుగా విచారించాలి**

**మదనపల్లె ఫైళ్ల దహనం కేసులో సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు**

**పెద్దిరెడ్డి అనుచరుడు మాధవరెడ్డి తదితరుల ముందస్తు బెయిల్‌కు నో**

**పిటిషన్ కొట్టివేత.. హైకోర్టు ఆదేశాల్లో జోక్యానికి నిరాకరణ**



**న్యూఢిల్లీ, ,మార్చి9 (జర్నలిస్ట్ వార్త):**
మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఫైళ్ల దహనం కేసులో నిందితులకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. వారికి ముందస్తు బెయిల్‌ను కోర్టు నిరాకరించింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు ఎటువంటి బలమైన కారణాలు కనిపించడం లేదంటూ, నిందితుల పిటిషన్లను కొట్టివేసింది. ఫైళ్ల దహనం తీవ్రమైన నేరం అని మిగతా 2లో...

## అత్యున్నతంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

**ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు**

**ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ**

**క్రీడాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్,,మార్చి9 (జర్నలిస్ట్ వార్త):**
అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. వర్సిటీ నిర్మాణాలకు సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించారు. దీనికి సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని సదుపాయాలతో స్పోర్ట్స్ వర్సిటీ నిర్మాణాలు ఉండాలి. ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలుమిగతా 2లో...

## రైతుల సొమ్ముతో 'రాహుల్ బంధు' పథకం

**ఆరు గ్యారంటీల అమలు చట్టబద్ధత కోసం ప్రయివేటు బిల్లు పెడతాం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్**





2లో.

## వెలుగుమట్ల బాధితులతో కవిత ధర్నా

**ఖమ్మం జడ్పీ కూడలిలో ఆందోళన**

**ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం**

**కవితను అరెస్ట్ చేసిన పోలీసులు**

# శాంతివైపే..

**మొదటిపేజీ తరువాయి**

తక్షణమే ఉద్రిక్తతల తగ్గింపు నకు చర్యలు తీసుకోవాలని, సంయమనం పాటించాలని కోరారు. పౌరుల భద్రతకు హామీ కల్పించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. పశ్చిమాసియాలో పెచ్చరిల్లిన పరిస్థి తులు మనందరికీ తీవ్ర ఆందోళనను కలిగిస్తు న్నాయన్నారు. అన్ని సమస్యల పరిష్కారానికి చర్చలు జరపడమే అత్యంత సమర్థవంతమైన పరిష్కార మార్గమని, దీన్ని అందరూ ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ ప్రాం తంలోని అన్ని దేశాల సార్వభౌమాధికారా న్ని, ప్రాదేశిక సమగ్రతను అందరూ గౌరవించా ల్సిందేనని స్పష్టం చేశారు. పశ్చిమాసియా ప్రాంతంలోని భారతీయుల సంక్షేమం, భద్రతకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంద న్నారు. అక్కడి పరిణామాలను ప్రధాని మోడీ ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తున్నారన్నారు. ఘర్షణలు చెలరేగినప్పటి నుంచి నిరంతరంగా అక్కడి పరిస్థితులను మదింపు చేస్తున్నామన్నారు.

మోడీ అధ్యక్షతన భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ సమావేశమై అక్కడి భారతీయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించిందన్నారు. ఇంధన భద్రతకు, చమురు, గ్యాస్ సరఫరాకు ఆ ప్రాంతం కీలకమైనది, గల్ఫ్ ప్రాంతానికి భారత్ ప్రధాన వాణిజ్య భాగస్వామి అని, ఏటా దాదాపు 200 బిలియన్ల డాలర్ల మేరకు వాణిజ్యం జరుగుతుందని చెప్పారు. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ప్రాంతీయ భద్రతకు ఎదురవుతున్న పర్యవసానాలపై, ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలపై కమిటీ దృష్టి పెట్టిందని చెప్పారు. ఆ ప్రాంతంలోని అన్ని దేశాల అధిపతులతో భారత్ మాట్లాడిందన్నారు. ఆయా దేశాల్లో భారతీయుల భద్రతకు అన్ని చర్యలు తీసుకుంటామని వారు కూడా హామీ ఇచ్చారన్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించేందుకు, భారతీయుల అభ్యర్థనలపై స్పందించేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. తాజాగా మార్చి 5న ఇరాన్ విదేశాంగ మంత్రి అరగ్చితో మాట్లాడారనని, రాబోయే రోజుల్లో కూడా ఈ సంభాషణలు కొనసాగుతాయని చెప్పారు. ఇరాన్ నౌక ఐఆర్ఐఎస్ లావాన్‌కు కోచిలో ఆశ్రయం ఇచ్చామని, మానవతా ప్రాతిపదికనే ఈ అనుమతి ఇచ్చామని చెప్పారు."మనకు సంబంధించినంత వరకు భారతీయుల ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యత. ఈ సున్నితమైన పరిస్థితులు నెలకొన్న తరుణంలో మన ఇంధన సంస్థల ప్రయత్నాలకు అవసరమైన చోట భారత దౌత్యం మద్దతిస్తుంది." అని జైశంకర్ స్పష్టం చేశారు.

# కవిత, కేజ్రీవాల్ కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

**మొదటిపేజీ తరువాయి**

ఈ నేపథ్యంలో కోర్టు తీర్పును ఢిల్లీ హైకోర్టులో సీబీఐ సవాల్ చేసింది. ఈ క్రమంలో సీబీఐ పిటిషన్ పై ఈరోజు హైకోర్టు విచరాణ జరిపింది. ఈ విచారణలో భాగంగా ధర్మాసనం కేజ్రీవాల్, కవిత, సిసోడియాతో పాటు మిగిలిన నిందితులందరికీ నోటీసులు జారీ చేసింది. సీబీఐ దాఖలు చేసిన ఈ రివిజన్ పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. విచారణ సందర్భంగా సీబీఐ తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ... విచారణాధికారిపై కోర్టు చేసిన వ్యాఖ్యలు దర్యాప్తు సంస్థల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన హైకోర్టు, దర్యాప్తు సంస్థ, విచారణాధికారిపై ట్రయల్ కోర్టు చేసిన ప్రతికూల వ్యాఖ్యలపై స్టే విధిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాకుండా, సీబీఐ కేసులో నిందితులు విడుదలయ్యారు కాబట్టి ఈడీ దాఖలు చేసిన మనీ లాండరింగ్ కేసు విచారణను కూడా నిలిపివేయాలని నిందితుల తరపు న్యాయవాదులు కోరగా.. హైకోర్టు భిన్నంగా స్పందించింది. సీబీఐ రివిజన్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే వరకు మనీ లాండరింగ్ కేసు విచారణను వాయిదా వేయాలని ట్రయల్ కోర్టుకు సూచించింది. తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

# కాల్పుల విరమణకు ఇరాన్ 'నో'

**మొదటిపేజీ తరువాయి**

ఇరాన్‌పై పెద్ద ఎత్తున దాడులు చేశామని ఇజ్రాయిల్ తెలిపింది. ఇస్ఫహాన్ గవర్నరేట్ భవనంపై జరిగిన దాడిలో ముగ్గురు గాయపడగా ఇద్దరు ఇప్పటికీ శిథిలాల కింద చిక్కుబడి ఉన్నారు. హెజ్బొల్లాతో సంబంధం ఉన్న సంస్థకు చెందిన శాఖలపై దాడులు చేస్తానని ముందుగానే హెచ్చరించిన ఇజ్రాయిల్‌-లెబనాన్ రాజధాని బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలపై దాడి జరిపింది. ఇజ్రాయిల్ వైపు నుంచి జరుగుతున్న దాడులు ఉధృతం కావడంతో లెబనాన్ ప్రజలు అరిడా సరిహద్దును దాటి లిబియాకు చేరుకుంటున్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి ఇప్పటి వరకూ ఇజ్రాయిల్ జరిపిన దాడులలో లెబనాన్‌లో 83 మంది చిన్నారులు చనిపోయారని యునిసెఫ్ వివరించింది. దక్షిణ లెబనాన్‌పై జరిగిన దాడిలో ఇద్దరు పారా మెడికల్ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. లెబనాన్ పరిస్థితిపై చర్చించేందుకు భద్రతా మండలిని అత్యవసరంగా సమావేశపరచాలని ఫ్రాన్స్ కోరింది. అటు ఇరాన్ కూడా గల్ఫ్ దేశాలలోని అమెరికా కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని విస్తృతంగా దాడి చేస్తోంది. ఆదివారం రాత్రి బహ్రెయిన్‌లోని సిత్రా దీవిపై ఇరాన్ జరిపిన డ్రోన్ దాడిలో 32 మంది గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదని బహ్రెయిన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణిని నాటో రక్షణ వ్యవస్థలు తటస్థం చేశాయని టర్కీ చెప్పింది. భద్రతాపరమైన ముప్పు పెరిగే అవకాశం ఉన్నం దున ఆవాసాలను వదిలి బయటికి రావద్దని ఖతార్ తన ప్రజలకు సూచించింది. తమ నౌకాదళం కువైట్‌లోని అదిరి హెలికాప్టర్ స్థావరంపై డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణులతో దాడి చేసిందని ఇరాన్ ఐఆర్‌జీసీ ఒక ప్రకటన చేసింది. స్థావరంలోని ఇంధన, గ్యాస్ ట్యాంకులను, అమెరికా హెలికాప్టర్ ర్యాంపులను, లాజిస్టిక్ సౌకర్యాలు ధ్వంసమయ్యాయని చెప్పింది. ఇదిలావుండగా దాడులు కొనసాగి నంత కాలం కాల్పుల విరమణ కోసం మధ్య వర్తిత్వ ప్రయ త్నాలు జరపడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖై స్పష్టం చేశారు. స్వీయ రక్షణకు ఇరాన్ ప్రయత్నాలు కొనసాగుతాయని చెప్పారు. తుర్కియే, అజర్‌బైజాన్, సైప్రస్‌పై తాము దాడులు జరుపుతున్నామంటూ వస్తున్న వార్తలను ఆయన తోసిపుచ్చారు. ఇరాన్ చమురు నిల్వలపై అమెరికా, ఇజ్రాయిల్ కన్నేశాయని, ఆ దేశాల దాడులు అంతర్జాతీయ చట్టాలను ప్రమాదంలో పడేస్తున్నాయని ఆరోపించారు.

## భగ్గుమన్న చమురు ధరలు

యుద్ధం కారణంగా సరఫరాలకు తీవ్ర ఆటంకం ఏర్పడడంతో చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్యారల్ ముడి చమురు ధర వంద డాలర్లు పెరిగింది. బ్రెంట్ ముడి చమురు (తేలికపాటి, తియ్యని చమురు) 2022 తర్వాత తొలిసారిగా 114 డాలర్లు దాటింది. హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో సౌదీ అరేబియా సంస్థ అరామ్కో రెండు చమురు క్షేత్రాలలో ఉత్పత్తిని నిలిపివేసింది. అనేక అరబ్ దేశాలు కూడా చమురు ఉత్పత్తిలో కోత విధిం చాయి. పెరుగుతున్న చమురు ధరలపై చర్చిం చేందుకు జీ7 దేశాలు అత్యవసర సమావేశాన్ని నిర్వహించాయి. బ్రిటన్ ఛాన్సలర్ రాచల్ రీవ్స్ సహా ప్రముఖ పారిశ్రామిక దేశాల ఆర్థిక మంత్రులు ఈ సమావేశానికి హాజర య్యారు. యుద్ధం కారణంగా కలిగే ఆర్థిక ప్రభా వంపై చర్చించారు. ఇంధన సరఫ రాలకు దీర్ఘ కాలం ఆటంకం ఏర్పడుతుందన్న భయాం దోళనల నేప థ్యంలో అంతర్జాతీయ చమురు ధర సుమారు 120 డాలర్లకు చేరింది.

## పరస్పర నిర్ణయం మేరకే యుద్ధం ముగింపు : ట్రంప్

ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూను సంప్ర దించి ఇరాన్ యుద్ధాన్ని ఎప్పుడు ముగించాలో నిర్ణయిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇరాన్‌పై జరుపుతున్న దాడుల విష యంలో బ్రిటన్ అను సరిస్తున్న వైఖరిపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రంప్‌తో బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ టెలిఫోన్ సంభాషణ జరిపారు. మధ్య ప్రాచ్యానికి యుద్ధ విమాన వాహక నౌకలను పంపాలని అనుకుంటు న్నామని స్టార్మర్ చేసిన ప్రకటనపై ట్రంప్ స్పందిస్తూ ఇప్పటికే గెలిచిన యుద్ధా నికి వాటి అవసరం ఏముం దని ప్రశ్నించారు. మధ్యప్రాచ్యంలో కొన సాగుతున్న యుద్ధం కారణంగా లెబనాన్ పార్లమెంట్ పదవీకాలాన్ని రెండు సంవత్సరాల పాటు పొడిగించారు.

# అత్యున్నతంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

**మొదటిపేజీ తరువాయి**

ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటేలా చర్యలు తీసుకోవాలి. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియాన్ని ఆధునికీకరించాలి. అదేవిధంగా గచ్చిబౌలి ఔట్‌డోర్ స్టేడియాన్ని పునరుద్ధరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్రీడాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పనపై అధికారులతో చర్చించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పన, అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్చించారు. ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా రాష్ట్రంలో అన్ని సౌకర్యాలతోపాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలని సీఎం అన్నారు. గచ్చిబౌలి ఔట్ డోర్ స్టేడియంను పునరుద్ధరించడం తో పాటు, స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు, శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా నిర్మాణాలకు సంబంధించి పలు డిజైన్లను పరిశీలించారు. డిజైన్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేసారు. ఒలంపిక్స్, కామన్ వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా, ఒలంపిక్స్ లో తెలంగాణ క్రీడాకారుల సత్తా చాటడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్ నగర్ స్టేడియంలను భవిష్యత్ అవసరాలు, శిక్షణ, పోటీలకు అనుగుణంగా ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేంనరేందర్ రెడ్డి, శాప్ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాస రాజు, శేషాద్రి, ఎండీ సోనీ బాలదేవి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి. కిషోర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ నుంచి ఇద్దరు రాజ్యసభకు ఏకగ్రీవం

**మొదటిపేజీ తరువాయి**

అభిషేక్ మను సింఘ్వీలు రాజ్యసభకు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. అందుకు సంబంధించిన పత్రాలను వీరికి అందజేసినట్లు తెలిపారు. అభిషేక్ మను సింఘ్వీ తరఫున అడ్వకేట్ సుందర్ చౌహాన్ అందుకున్నారు. వేం నరేందర్ రెడ్డి అసెంబ్లీ కార్యాలయానికి వచ్చి ధృవీకరణ పత్రం స్వీకరించారు. రాజ్యసభలో పలువురి సభ్యుల పదవి కాలం ఏప్రిల్‌లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్ర ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. గురువారంతో నామినేషన్ల ప్రకియ ముగిసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ తరఫున తెలంగాణ నుంచి అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. తెలంగాణ అసెంబ్లీలో ఏర్పాటు చేసిన రాజ్యసభ ఎన్నికల కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డికి వీరు తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఇక.. సాయి అనే వ్యక్తి సైతం ఈ రాజ్యసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అతడి అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడంతో.. శుక్రవారం ఆ నామినేషన్‌ను తిరస్కరించారు. అలాగే ఇతరులు ఎవ్వరూ నామినేషన్ల దాఖలు చేయలేదు. దీంతో కాంగ్రెస్ నుంచి నామినేషన్ల దాఖలు చేసిన అభిషేక్, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక ఏకగ్రీవమైంది.

# ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు

**మొదటిపేజీ తరువాయి**

. రిసోర్సెస్, సమయాన్ని కేటాయిస్తే టెక్నికల్ ఛాలెంజ్‌ను అధిగమించవచ్చన్నారు. కానీ అడాప్టివ్ఛాలెంజ్ విషయంలో ఎదురైన సమస్య లోతును అర్థంచేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు అదుపులో ఉండాలన్నారు. రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ ఉండకూడదనే తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్ ను ఆవిష్కరించుకున్నామని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడానికి ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న 2100కి.మీ ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ గా పరిగణించుకుంటున్నాం అని అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని అన్నారు. దేశంలో ఢిల్లీ అత్యంత కాలుష్య నగరంగా మారింది. ట్రాఫిక్ సమస్యలతో బెంగుళూరు నగరంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముంబై, చెన్నై నగరాలు వరదలతో సతమతమవుతున్నాయి.

అలాంటి మెట్రోపాలిటన్ నగరాల నుంచి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏ సమస్య వచ్చినా ప్రజలు మొట్టమొదట సహాయం కోసం ఎదురు చూసేది పోలీసుల కోసమేనని అన్నారు. ఒకప్పుడు తీవ్రవాదం ఒక సమస్యగా ఉండేది.. ఇందుకోసం ఆక్టోపస్, గ్రేహౌండ్స్ లాంటి వ్యవస్థలు తీసుకొచ్చారు.



అవినీతిని నిరోధించేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఫిజికల్ క్రైమ్ నిరోధించేందుకు ఇప్పటి వరకు వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాం. కానీ ఇప్పుడు నేర స్వరూపమే మారిపోయింది. సైబర్ క్రైమ్ పెరిగిపోతున్న ఈ రోజుల్లో మన సిస్టం ను అప్ గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న అధికారులను నియమించుకోవాల్సిన అవసరం ఉంది. ఉన్న సిబ్బంది, అధికారులను అప్ గ్రేడ్ చేసుకోకపోతే నేరాలను నిరోదించలేమని గుర్తు చేశారు. రిట్రీట్ కార్యక్రమం ద్వారా మీ సమస్యలను గుర్తించి విశ్లేషించుకున్నారు. సమస్య ఏమిటో గుర్తిస్తే 50 శాతం సమస్య పరిష్కారం అయినట్లే.

సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్ మెంట్, ఇతర అంశాలకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారానికి మీరు కొన్ని ప్రతిపాదనలు అందించారు. సమస్యల పరిష్కారానికి మీరు అందించిన ప్రతిపాదనలపై విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక అధికారుల కమిటీ ఏర్పాటు చేస్తాం.. మీ ప్రతిపాదనలపై కమిటీలో విశ్లేషించి చట్టం రూపంలో మా ముందుకు తీసుకురండి. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రభుత్వం దానిపై నిర్ణయం తీసుకుంటుంది. పోలీస్ శాఖలో సిబ్బంది రేషనలైజేషన్ చేసుకుని జనాభా ప్రాతిపదికన పోలిసింగ్ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. పోలీస్ శాఖలోని వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలి. పోలీస్ శాఖలో ఉద్యోగులు ఆటో మోడ్ కు వెళితే సమాజానికి అత్యంత ప్రమాదకరం. ఇతర శాఖల్లా పోలీస్ శాఖలో ఆటో మోడ్.. ఆటో ప్రమోషన్ ఉండదు. పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు అప్ గ్రేడ్ అవ్వాల్సిందేనని అన్నారు. అవసరమైన నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంది.

మీ పనితీరు ఆధారంగానే పోస్టింగులు ఉంటాయి. ప్రతీ ఏటా డిసెంబరులో రిట్రీట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. బడ్జెట్ ప్రవేశపెట్టకముందే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకుంటే అవసరమైన నిధులను బడ్జెట్ లో కేటాయించుకోవచ్చుని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమానికి వచ్చిన సిఎంకు పోలీస్ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.

# 25 రోజుల తర్వాతే గ్యాస్ బుకింగ్

**మొదటిపేజీ తరువాయి**

చేస్తున్నారని, అందువల్లే గడువు పెంచుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే గృహ వినియోగదారులకు వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.60, వాణిజ్య సిలిండర్‌పై రూ.114.5 భారం వేసిన సంగతి తెలిసిందే. గ్యాస్ కొరత, ధరల పెంపు నేపథ్యంలో కమర్షియల్ గ్యాస్ వినియోగించే హోటళ్లు, రెస్టారెంట్లు ధరలను మరింత పెంచే అవకాశముందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

# 'ఫైళ్ల దహనం' తీవ్రమైన నేరం

**మొదటిపేజీ తరువాయి**

వ్యాఖ్యానించింది. ఫైళ్ల దహనం కేసులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రధాన అనుచరుడు వంకిరెడ్డి మాధవరెడ్డి, ఇతరుల ముందస్తు బెయిల్‌ను నిరాకరిస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ, వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సోమవారం జస్టిస్ మనోజ్‌మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. నిందితుల తరపున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు, రాష్ట్రప్రభుత్వం తరపున సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. నిందితుడికి ఘటనతో సంబంధం లేదని, మంత్రి వద్ద పీఏగా పనిచేశారనే కారణంతోనే ఈ కేసులోకి లాగారని దామా శేషాద్రినాయుడు వాదించారు. ఆ ఘటన జరిగినప్పుడు అక్కడ ఆయన లేరని, అప్పటికి ఆరు నెలలుగా విదేశాల్లో ఉంటున్నారన్నారు.

ఆయనకు వ్యతిరేకంగా పోలీసుల వద్ద సరైన ఆధారాలు లేవని, కేవలం అనుమానంతోనే కేసు పెట్టారని పేర్కొన్నారు. నిందితుల తరపు వాదనలు విన్న బెంచ్, ప్రభుత్వ కార్యాలయంలో ఫైళ్ల దహనం అత్యంత తీవ్రమైన నేరమని అభిప్రాయపడింది. "రికార్డ్ రూమ్‌లో మంటలు ఎలా అంటుకున్నాయి? దాని వెనుక ఉన్న ప్లాన్ ఏమిటి? అనే విషయాలను పోలీసులు లోతుగా విచారించాల్సి ఉంది" అని వ్యాఖ్యానించింది. నిందితుడు విదేశాల్లో ఉన్నారనే కారణంతో విచారణ నుంచి తప్పించుకోలేరని, ఇటువంటి కేసుల్లో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. చట్టప్రకారం విచారణ కొనసాగాలని, ఇందుకు నిందితుడు సహకరించాలని స్పష్టం చేసింది.

# రైతుల సొమ్ముతో 'రాహుల్ బంధు' పథకం

**ఆరు గ్యారంటీల అమలు చట్టబద్ధత కోసం ప్రయివేటు బిల్లు పెడతాం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్**

**రాజన్న సిరిసిల్ల,మార్చి9 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రైతులకివ్వాల్సిన సొమ్మును 'రాహుల్ బంధు' పేరుతో ఏడాదికి రూ.వెయ్యి కోట్లు తమ పార్టీకి సీఎం రేవంత్‌రెడ్డి దోచిపెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఆరోపించారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రయివేటు మెంబర్ బిల్లును తీసుకొచ్చే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని అన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం మున్సిపల్ కౌన్సిలర్ల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలు చట్టబద్ధత కోసం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కూడా ప్రయివేటు మెంబర్ బిల్లుకు ఓటు వేయాల్సి వస్తుందని, ఎందుకంటే కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ చెప్పిన మాటనే తాము అసెంబ్లీలో చెప్తామని అన్నారు. ఈ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ ముందుకు వచ్చి మద్దతు ఇచ్చి ప్రజలకు ఇచ్చిన




హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'రాహుల్ బంధు' అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టినట్టు కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ 'రాహుల్ బంధు' పథకాన్ని రైతులకు ఇచ్చే రైతు బంధు నిధులతో మొదలుపెట్టారని, ఏడాదికి రూ.వెయ్యి కోట్లు రాహుల్ గాంధీకి ఇచ్చేలా పక్కాగా అమలు చేస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ కుటుంబానికి ఎప్పుడు ఇబ్బంది అయినా రూ.వేల కోట్లు పంపించేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికే మూడుసార్లు రైతు బంధును ఎగ్గొట్టి.. ఈసారి కూడా ఎగనామం పెడుతున్నారని విమర్శించారు. ఇంకోవైపు సామంత రాజుగా వ్యవహరిస్తూ రాహుల్ గాంధీనికి కప్పం కట్టేందుకు పేదల భూములు లాక్కుని, వారి ఇండ్లు కూలగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని అన్నారు. అందుకే హైదరాబాద్ నుంచి మొదలుకొని ఖమ్మం దాకా అన్ని చోట్ల పేదల ఇండ్లను కూలగొట్టి వ్యాపారం చేసి డబ్బులు సంపాదిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, జిల్లా పార్టీ ఇన్‌చార్జీ తుల ఉమ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, మున్సిపల్ వైస్ చైర్మెన్ దార్ల సందీప్, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, జిల్లానాయకులు చల్మెడ లక్ష్మీనరసింహారావు, చీటి నర్సింగరావు పాల్గొన్నారు.

# వెలుగుమట్ల బాధితులతో కవిత ధర్నా

**ఖమ్మం,మార్చి9 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవనంలో వెలుగుమట్ల బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకూ బాధితులకు ప్రభుత్వం అండగా లేదని విమర్శించారు. ప్రభుత్వం తరపున వారికి వైద్య సహాయం కూడా అందలేదన్నారు. అనంతరం ఖమ్మం జడ్పీ కూడలిలో కవిత ఆందోళనకు దిగారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలంటూ ధర్నా నిర్వహించారు. బాధితులతో కలిసి జడ్పీ కూడలిలో రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని సర్ది చెప్పడంతో ఆమె నిరసనను విరమించుకున్నారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలోని జడ్పీ సెంటర్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెలుగుమట్ల భూదాన్ యజ్ఞ బోర్డు భూముల నిర్వాసితులతో కలిసి ఆందోళనకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత దిగారు. ఈ క్రమంలో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కవితతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్, పలువురు ఆందోళనకారులను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మం నగరంలో వెలుగుమట్ల ప్రాంతానికి చెందిన భూదాన్ యజ్ఞ బోర్డు భూముల నిర్వాసితులతో కలిసి కవిత సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగింది. అక్కడికి చేరుకున్న అనంతరం కవిత అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ ర్యాలీ అనంతరం నిర్వాసితులు ఖమ్మం జడ్పీ సెంటర్ వద్ద ఆందోళనకు దిగారు. తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారు నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనలో భాగంగా కొంతమంది నిర్వాసితులు రాస్తారోకో నిర్వహించి వాహనాలను అడ్డుకున్నారు. దీంతో జడ్పీ సెంటర్ పరిసరాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు.

## మార్చి 11 నుంచి పశువులకు టీకాల కార్యక్రమం

**భీమదేవరపల్లి పశువైద్యాధికారి మాలతి**




**భీమదేవరపల్లి/మార్చి9 (జర్నలిస్ట్ వార్త):** పశు వైద్య మరియు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి డా. మాలతి తెలిపారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె వివరించారు. మండలంలోని గేదెలు, ఆవులు, దూడలు, నాలుగు నెలలు దాటిన లేగలు అన్నింటికీ 11 మార్చి 2026 నుండి 10 ఏప్రిల్ 2026 వరకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు తెలిపారు. గాలికుంటు వ్యాధి పశువులకు తీవ్ర నష్టం కలిగించే అవకాశం ఉండటంతో రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. మండలంలోని పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పశువులను టీకాలు వేయించుకోవాలని పశు వైద్యాధికారి డా. మాలతి కోరారు.

## ఇర్సులాపురంలో ఎండిపోతున్న పొలాలను సందర్శించిన ఇరిగేషన్ డిఈ,వ్యవసాయ అధికారి.



**బయ్యారం/మార్చి9(జర్నలిస్ట్ వార్త);**బయ్యారం మండలంలో ఇర్సులాపురం ఆయకట్టుకు రబీ పంట సాగుకు నీరు అందించే విధంగా ఇరిగేషన్ అధికారులు అంకమ్మ బుర్ర వరకు సాగు చేసే విధంగా ఇరిగేషన్ అధికారులు ప్రణాళికలు చేసి నీటి విడుదల చేపట్టారు.ఇరుస్లాపురంలోని రైతులకు గత కొన్ని రోజులుగా నీరు రావడంలేదని,ఇరిగేషన్ అధికారులు సక్రమంగా నీరు విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని,దీని వలన వరి సాగు పంట ఎండిపోతుందని ఆరోపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు.వార్త కథనాలకు స్పందనగా సోమవారం ఇరిగేషన్ అధికారులు చౌటుగడ్డ ఈసం లక్ష్మయ్య బుర్రవరకు రబీ పంటకు నీరు జప్యంతో ఎండిపోయిన వరి పొలాలను ఇరిగేషన్ డిఈ నాగార్జునసాగర్,మండల వ్యవసాయ అధికారి రాజు,ఏఈ పృథ్వి,అఖిల సందర్శించారు.ఈ సందర్భంగా డిఈ మాట్లాడుతూ బయ్యారం పెద్ద చెరువులో 11 అడుగుల వరకు నీరు నిలువ ఉందని 1500 ఎకరాలకు నీరు సమృద్ధిగా అందుతుందని విడతల వారీగా కాలువకు అడ్డుకట్టలను వేస్తూ నీటిని జాగ్రత్తగా రైతులు వినియోగించుకొని పంటలు పండించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఈవోలు నాగరాజు, ఫయాజ్,లష్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## సింగారంలో ఐటీడీఏ ద్వారా మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన.



**బయ్యారం/మార్చి 9(జర్నలిస్ట్ వార్త);**బయ్యారం మండలం సింగారం గ్రామపంచాయతీలో ఐటీడీఏ ద్వారా బానోత్ జ్యోతి మంజూరైన ఇందిరమ్మ ఇల్లుకు సింగారం సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ సోమవారం శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పావని,ఉప సర్పంచ్ చుంచు మమత సాయికిరణ్, వార్డు సభ్యులు చుంచు అనిల్ కుమార్,చెరుకుపల్లి మనిషా,గుగులోత్ బద్రు నాయక్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకుపల్లి రవి,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగావత్ రవి నాయక్, గుగులోత్ మహేష్ నాయక్,గుగులోత్ వెంకటేష్ నాయక్,గుగులోత్ సురేష్ నాయక్,సపవత్ రాందాస్ నాయక్, బోడ శ్రీను,నునావత్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## మడిపెద్ది రామచంద్రు ఆశయాలను కొనసాగిస్తాం

**-ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు.**






**బయ్యారం/మార్చి 9.(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండలం లక్ష్మీ నరసింహపురం గ్రామ కమిటీ సీనియర్ నాయకులు కామ్రేడ్ మడిపెద్ది రామచంద్రు సంతాప సభ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ బయ్యారం మండల కమిటీ సభ్యులు మెంగు భగవాన్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు.కామ్రేడ్ రామచంద్రుకు సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించి పార్టీ మండల కమిటీ తరఫున విప్లవ జోహార్లు అర్పిస్తూ వారి కుటుంబానికి బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ సభను ఉద్దేశించి అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు పార్టీ జిల్లా నాయకులు, హలవతు లింగ్యా మాట్లాడుతు మడి పెద్ది రామచంద్రు చిన్నతనం నుండి పేద రైతుగా హమాలి కార్మికుడిగా జీవిస్తూ 1990 సంవత్సరంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీలో చేరి ఈ ప్రాంతంలో భూస్వాముల దొరతనానికి అణిచివేతలకు వ్యతిరేకంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నిర్వహిస్తున్న భూమిలేని అన్ని వర్గాల ప్రజలకు భూమిని సాధించిపెట్టే పోరాటంలో వ్యవసాయ కూలీల రేట్ల పెంపుదల కోసం తునికాకు రేటు పెంపుదల కోసం అనేక రైతాంగ పోరాటాల్లో కామ్రేడ్ రామచంద్రు క్రియాశీలక పాత్రను పోషించారని వారు అన్నారు. రామచంద్రు ఏ లక్ష్యం సాధన కోసం పోరాడారో ఆ మార్గంలో ముందుకు సాగాలని,నేడు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు.ఈ సంతాప సభలో నెల్లుట్ల ప్రసాద్,రామచంద్రుల మురళి,గుగ్లోతు హనుమ,ఎస్.కె మహమ్మద్,మడిపెద్ది లింగమూర్తి,నరాల వెంకన్న,రంగయ్య,కొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపేట అభివృద్ధే లక్ష్యం

**వార్డుల్లో పర్యటించిన చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్**



**నర్సంపేట/మార్చి9 (జర్నలిస్ట్ వార్త):**
నర్సంపేట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడమే లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ తెలిపారు. నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం మున్సిపల్ పరిధిలోని 13, 14, 15వ వార్డుల్లో కౌన్సిలర్లు ఏపూరి శ్రీనివాస్ రెడ్డి, భూక్య మాతృనాయక్‌లతో కలిసి పర్యటించారు.
ఈ సందర్భంగా వార్డులలో ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కౌన్సిలర్లు దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో త్వరితగతిన పరిష్కరిస్తామని చైర్‌పర్సన్ తెలిపారు.పట్టణంలో తాగునీటి సమస్య, రోడ్లు, డ్రైనేజీలు తదితర మౌలిక సదుపాయాల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో సానిటేషన్ ఎస్సై శ్యామ్, వాటర్ సప్లై ఇన్‌చార్జ్ కాట శ్రీను, వార్డు ఆఫీసర్ అశోక్, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, మాజీ సొసైటీ చైర్మన్ బొబ్బల రమణారెడ్డి, మాజీ సర్పంచ్ మిడిమాలపు మధు, మాజీ సొసైటీ డైరెక్టర్ బైరి జనార్దన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తాళ్లపెల్లి దేవేందర్, మిడిమాలపు దామోదర్, నర్సంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొంత రంజిత్, మేడి రంజిత్, కీసరి భరత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## పరీక్షల పట్ల విద్యార్థులు భయాందోళన చెందొద్దు

**10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ**





**తల్లాడ/ మార్చి 9 (జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామ జడ్పీఎస్ఎస్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల పట్ల అవగాహన కల్పిస్తూ పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. మాజీ గ్రామ సర్పంచ్ మారెళ్ళ మమత, మాజీ ఎంపీటీసీ తుమ్మలపల్లి సత్యవతి, సొసైటీ డైరెక్టర్ గోవిందు శ్రీనివాసరావు, జిల్లా నాయకుడు తుమ్మలపల్లి రమేష్, మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్, పిన్ని కృష్ణయ్య, గోవింద్ అప్పరావు, వార్డ్ మెంబర్లు అలవాల దావీదు, గొడ్ల దేవిడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ సూచనల మేరకు విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు మరియు ఇతర పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు.కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఆశ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే విద్యార్థులు పరీక్షల సమయంలో భయపడకుండా, ఒత్తిడికి లోనుకాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు. అన్నారుగూడెం గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎంఈఓ దామోదరవరప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు సమర్థవంతంగా పరీక్షలు రాసి నూటికి నూరు శాతం ఫలితాలు సాధించి గ్రామానికి, పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు సైద్ధాంతిక శిక్షణ అవసరం

**రాయపర్తి/మార్చ్ 9 (జర్నలిస్ట్ వార్త):**కార్యకర్తలకు సైద్ధాంతిక శిక్షణ అవసరం అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాగాల నవీన్ రెడ్డి అన్నారు.మండల కేంద్రము లోనీ భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో మండల పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ కార్యక్రమం బీజేపి మండల అధ్యక్షుడు నూనె అనిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాగాల నవీన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ,నీతి నిజాయితీ,నిబద్ధత కలిగిన కలిగి, అనేక మంది కార్యకర్తలు త్యాగం చేసిన ఫలితంగా నేడు బీజేపీ అత్యంత పటిష్టమైన పార్టీ గా అవతరించి ధేశంలో అధికారంలో కొనసాగుతూ ఇరవై రెండు రాష్ట్రాలు,రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో అధికారంలో ఉంది అని తెలిపారు.కార్యకర్తలకు సైద్ధాంతిక శిక్షణ ఇచ్చి ప్రతీ ఒక్కరికీ బీజేపీ ఆశయాలు, క్రమశిక్షణ గురించి అవగాహన కల్పించి ప్రజా క్షేత్రంలో బీజేపీ శ్రేణులు అనుసరించాల్సిన విధానంపై,రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం వ్యూహ రచన ఈ శిక్షణా తరగతుల ద్వారా భోదించడం జరుగుతుంది అని తెలిపారు.ఈశిక్షణా శిబిరంలో ఆరు సెషన్స్ లలో శిక్షకుల ద్వారా శిక్షణ ఇప్పించడం జరిగింది.ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్, జిల్లా ప్రశిక్షణా కమిటీ కో కన్వీనర్ వడ్లకొండ రవి,మండల ప్రధాన కార్యదర్శులు మందపురి రాజు,నిమ్మల అనిల్, మండల మాజీ ప్రధాన కార్యదర్శి బూరుగు నవీన్ మండల ఉపాధ్యక్షులు చిర్ర నాగరాజు మునవతు భద్ర మండల కార్యదర్శి మందపురి రాజశేఖర్ మండల బిజెపి నాయకులు కూన యాదగిరి, యాదయ్య,సోడియ సురేష్ భారతీయ జనతా యువమోర్చా మండల అధ్యక్షులు మంచాల సుమన్ ఎస్సీ మోర్చ మండల అధ్యక్షులు గారే అశోక్ మండల నాయకులు జక్కుల సందీప్ పండు రాకేష్ సిద్దు తదితరులు పాల్గొన్నారు.



## పల్లె ప్రకృతి వనాలను వినియోగంలోకి తీసుకురావాలి

**ఎంపిడిఓ జి. కిషన్**



**రాయపర్తి/మార్చి 9 (జర్నలిస్ట్ వార్త):**
మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. కిషన్ సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ప్రతి గ్రామంలో ఈ వనాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేసి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.పచ్చదనం, పరిశుభ్రతకు గ్రామాల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు. మొక్కల పెంపకం, సంరక్షణలో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. గ్రామ ప్రజలు విశ్రాంతి తీసుకునేలా, ఆహ్లాదకర వాతావరణాన్ని కలిగించేలా పల్లె ప్రకృతి వనాలను అభివృద్ధి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాష్, సర్పంచ్ గారే సహేంద్ర భిక్షపతి, పంచాయతీ కార్యదర్శి వినోద్ కుమార్, వార్డు సభ్యులు రాజబాబు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టుదలతో జాబ్ కొట్టిన విశ్వశాంతి పూర్వ విద్యార్థిని

## రూ.14 లక్షల ప్యాకేజీ సాధించిన భార్గవి

**సత్తుపల్లి/ మార్చి 9 (జర్నలిస్ట్ వార్త):**
సత్తుపల్లి విశ్వశాంతి విద్యాలయంలో నర్సరీ నుంచి పదో తరగతి వరకు (2019 బ్యాచ్) చదివిన నిరుపేద విద్యార్థిని బాణవత్ భార్గవి తన ప్రతిభతో ఉన్నత స్థాయికి ఎదుగుతోంది. ఐఐటీలో సీటు సాధించి ప్రస్తుతం జార్ఖండ్‌లో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఆమె, క్యాంపస్ ఇంటర్వ్యూలో సంవత్సరానికి రూ. 14 లక్షల ప్యాకేజీతో జంషెడ్‌పూర్‌లోని టాటా స్టీల్ కంపెనీలో మేనేజ్‌మెంట్ ఇంజనీర్‌గా ఉద్యోగాన్ని సాధించింది.సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి గ్రామానికి చెందిన భార్గవి తాను చదువుకున్న విశ్వశాంతి పాఠశాలకు సోమవారం అతిథిగా రావడంతో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ఆమెను ఘనంగా సత్కరించి అభినందించారు.ప్రోత్సాహమే విజయానికి బాటఈ సందర్భంగా భార్గవి మాట్లాడుతూ తన తల్లిదండ్రులు బాలాజీ, చంద్రావతి ఇచ్చిన ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత వల్లే పదో తరగతిలో





మంచి మార్కులు సాధించానని తెలిపింది. ఆ ప్రతిభతో ఇంటర్ చదవడానికి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఉచిత విద్యా అవకాశం లభించిందని పేర్కొంది.ఇంటర్‌లో కూడా ప్రతిభ కనబరిచినందుకు అప్పటి ట్రైబల్ వెల్ఫేర్ మంత్రి సత్యవతి రాథోడ్ చేతుల మీదుగా రూ.50 వేల నగదు బహుమతి మరియు ల్యాప్‌టాప్ అందుకున్నానని తెలిపింది. అనంతరం ఐఐటి జార్ఖండ్‌లో మెకానికల్ ఇంజనీరింగ్‌లో సీటు సాధించడంతో పాటు నేషనల్ స్కాలర్షిప్‌కు ఎంపిక కావడంతో పేదరికాన్ని జయించి బీటెక్ కోర్సును పూర్తి చేస్తున్నట్లు పేర్కొంది.ఈ కార్యక్రమంలో విశ్వశాంతి విద్యాలయం యాజమాన్యం పసుపులేటి నాగేశ్వరరావు, నరుకుళ్ల సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) నర్సంపేటలో

# టాస్క్ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం

### ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్



**నర్సంపేట /మార్చి 9 (జర్నలిస్ట్ వార్త):**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), నర్సంపేటలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం "ఆప్టిట్యూడ్ టెస్ట్ మరియు రీజనింగ్ స్కిల్స్" పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల టాస్క్ కోఆర్డినేటర్ ఎం.ఎం.కె. రహీముద్దీన్ ఆధ్వర్యంలో, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను పొందాలంటే ఆప్టిట్యూడ్ మరియు రీజనింగ్ నైపుణ్యాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఏ విధమైన పోటీ పరీక్షలకు అయినా ఈ శిక్షణ ఎంతో ఉపయుక్తమని, ఉన్నత విద్యలో కూడా ఇది విద్యార్థులకు దోహదపడుతుందని తెలిపారు. ఈ శిక్షణ విద్యార్థుల ఆలోచనా సామర్థ్యాన్ని పెంచి పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు తోడ్పడుతుందని అన్నారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.టాస్క్ జిల్లా బాధ్యులు రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు టాస్క్ ఆధ్వర్యంలో అనేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తును మెరుగుపరుచుకోవాలని సూచించారు.

టాస్క్ కళాశాల కోఆర్డినేటర్ ఎం.ఎం.కె. రహీముద్దీన్ మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు ఆప్టిట్యూడ్ మరియు రీజనింగ్ అంశాల్లో మెరుగైన అవగాహన పొందగలరని తెలిపారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ అనుమతితో ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను మరిన్ని నిర్వహించి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేస్తామని పేర్కొన్నారు.శిక్షకుడు రాజేష్ విద్యార్థులకు ఆప్టిట్యూడ్ మరియు రీజనింగ్‌కు సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలను వివరించి, పోటీ పరీక్షల్లో ప్రశ్నలకు వేగంగా మరియు సరైన విధంగా సమాధానాలు ఇవ్వడం గురించి ప్రాయోగికంగా వివరించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కందాల సత్యనారాయణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్. కమలాకర్, కెరీర్ గైడెన్స్ కన్వీనర్ డాక్టర్ సోమయ్య, ఎన్ఎస్ఎస్ జిల్లా బాధ్యులు డాక్టర్ ఎం. రాంబాబు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చైతన్య టెక్నో స్కూల్ సప్తమ వార్షికోత్సవం ఘనంగా

**సత్తుపల్లి/ మార్చి 9 (జర్నలిస్ట్ వార్త):**
స్థానిక గుడిపాడు రోడ్‌లోని చైతన్య టెక్నో స్కూల్‌లో సప్తమ వార్షికోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, సత్తుపల్లి మండల విద్యాధికారి ఎన్. రాజేశ్వరరావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాసరావు, సత్తుపల్లి మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్ దూదిపాళ్ళ రాంబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్-ఎస్‌సి2025లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది.ముఖ్య అతిథి డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో,




శ్రద్ధతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. గురువులు అందించిన విద్యాబుద్ధులను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండటం వల్ల చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని, లక్ష్యాలను సాధించడానికి అది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.సత్తుపల్లి మండల విద్యాధికారి ఎన్. రాజేశ్వరరావు మాట్లాడుతూ ఉన్నత విద్యా ప్రమాణాలు కలిగిన విద్యా సంస్థగా గుర్తింపు పొందిన చైతన్య టెక్నో స్కూల్‌ను అభినందించారు. పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు పరీక్షలంటే భయం లేకుండా ఆత్మవిశ్వాసంతో రాయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సీసీఈ విధానం విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించడానికే ఉద్దేశించిందని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులు, అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వై. మురళీకృష్ణ, డైరెక్టర్లు ఆర్. సుజాత, ఆర్. రాకేష్, ఎం. రవికుమార్, వై. ఉష, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిరుపేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

## తల్లాడ లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమం

**తల్లాడ/మార్చి9(జర్నలిస్ట్ వార్త):**
మండలంలోని నిరుపేద మహిళల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని తల్లాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు కోడూరు నాగేశ్వరరావు లలిత దంపతుల వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అధ్యక్షులు కోడూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ వివాహ దినోత్సవాన్ని సామాజిక సేవతో జరుపుకోవాలనే ఉద్దేశంతో నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేశామని తెలిపారు. తల్లాడకు చెందిన ఇజ్జగాని ఉషకు ఒకటి, మల్లారం గ్రామానికి చెందిన గుడిపల్లి రమాదేవికి మరో కుట్టు మిషన్‌ను అందజేసినట్లు చెప్పారు. ఈ మిషన్ల ద్వారా వారు స్వయం ఉపాధి పొందాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని






మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీ దారా శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ జాయింట్ కోఆర్డినేటర్ కర్నాటి లక్ష్మారెడ్డి, జెడ్‌సీ బెల్లంకొండ ఆంజనేయులు మాట్లాడుతూ, అధ్యక్షులు కోడూరు నాగేశ్వరరావు లలిత దంపతులు తమ వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా దినోత్సవ సందర్భంగా నిరుపేద మహిళలకు జీవనోపాధి కోసం కుట్టు మిషన్లు అందజేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరు తమ కుటుంబ వేడుకలను సేవా కార్యక్రమాలతో అనుసంధానించి పేదవారికి సహాయం చేస్తే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డీసీ దగ్గుల రాజశేఖర్ రెడ్డి, ట్రెజరర్ అనిమోలు సర్వేశ్వరరావు, శీలం వెంకటరెడ్డి, కటికి వెంకటేశ్వరరావు, తోట మురళి, తోట శ్రీనివాసరావు, గుడిపల్లి బాలకృష్ణ తదితరులు పాల్గొని అధ్యక్షులు నాగేశ్వరరావు లలిత దంపతులకు వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రభలతో ఘనంగా దేవతల ఊరేగింపు





**తల్లాడ/మార్చి9 (జర్నలిస్ట్ వార్త);** తల్లాడలో సోమవారం ప్రభలతో దేవతామూర్తులను రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించారు. మూడు రోజులు పాటు రజక సంఘం ఆధ్వర్యంలో పటం కళాకారులు ప్రదర్శించిన హరికథ లు అలరించాయి. లోక కళ్యాణం, గ్రామంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ దక్షయజ్ఞం, శివపురాణం, వీరభద్ర స్వామి యుద్ధం, మడేలయ్య స్వామి జీవిత చరిత్ర ను హరికథ రూపంలో కళాకారుడు కొండలరావు బృందం వారు ప్రదర్శించారు. అనంతరం తల్లాడ పురవీధులలో ప్రభల ద్వారా దేవతామూర్తులను ఊరేగించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపు సందర్భంగా తల్లాడలో దేవతలకు ఇంటింటికి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు.

# నూతన వధూవరులకు ఎర్రబెల్లి ఆశీర్వాదం



**రాయపర్తి/ మార్చి 9 (జర్నలిస్ట్ వార్త):**మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముద్రబోయిన అఖిల్‌శ్రీ పూజిత, సోడెపు అరవింద్‌అనూషల వివాహ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఈ సందర్భంగా ఆయన నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి కూడా పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహ నాయక్, లేతాకుల రంగారెడ్డి, గారే నర్సయ్య, ఐత రాంచందర్, ముద్రబోయిన సుధాకర్, చందు రాము, చందు మల్లయ్య, గారే విష్ణు, ఉప్పలయ్య, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు

# బీసీ కాలనీలో హ్యాండ్ బోర్ ఏర్పాటు

## గ్రేస్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం



**తల్లాడ/ మార్చి 9 (జర్నలిస్ట్ వార్త):**మండలంలోని కుర్నవల్లి గ్రామ బీసీ కాలనీలో గ్రేస్ స్వచ్ఛంద సంస్థ సహాయంతో హ్యాండ్ బోర్ ఏర్పాటు చేశారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చి ఈ బోరును ఏర్పాటు చేయించింది.హ్యాండ్ బోరును గ్రామ పెద్ద గంటల వెంకటాచారి ప్రారంభించారు. బోరు ప్రారంభించిన అనంతరం కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి నీరు తీసుకెళ్లారు. ఎండాకాలంలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని బోరు ఏర్పాటు చేయడం గ్రామస్తులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని స్థానికులు తెలిపారు.బోరు ఏర్పాటు చేసి గ్రామ ప్రజల దాహాన్ని తీర్చేందుకు సహకరించిన గ్రేస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు గ్రామస్తులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు

## బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా

# మహిళా దినోత్సవ వేడుకలు



**కొత్తగూడెం/మార్చి 9 (జర్నలిస్ట్ వార్త):**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ నాయకురాలు సముద్రాల గాయత్రి ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆదివారం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్ గాజులరాజం బస్తిలో ఆమె నివాసం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 60 సంవత్సరాలు దాటిన వృద్ధ మహిళలకు పట్టు శాలువాలు కప్పి, నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం వారి ఆశీర్వాదాలు తీసుకుంటూ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా సముద్రాల గాయత్రి మాట్లాడుతూ మహిళలు సమాజంలోని ప్రతి రంగంలో తమ ప్రతిభను చాటుతూ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. నారీ శక్తిగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించి మహిళా సాధికారత సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్‌కు చెందిన సీనియర్ సిటిజన్ మహిళలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# కార్మెల్ కాన్వెంట్ పాఠశాలలో నేడు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం



**ఎల్కతుర్తి/మార్చి9 (జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ పాఠశాలలో మంగళవారం డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు స్థానిక ఎస్సై అక్కినపల్లి ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్ డీఎస్పీతో పాటు పోలీసు అధికారులు హాజరవుతారని చెప్పారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, విద్యార్థినులు, ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లు, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని మీడియా ద్వారా కోరారు.

నేడు ఎల్కతుర్తికి మంత్రి పొన్నం ప్రభాకర్‌రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పలు అభివృద్ధి పనుల పరిశీలన కోసం ఎల్కతుర్తి మండల కేంద్రానికి రానున్నట్లు ప్రభుత్వ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో ఎన్. విజయ్ కుమార్ మంత్రి క్యాంప్ కార్యాలయం తరపున మీడియాకు తెలియజేశారు.

# అరెపల్లిలో త్రాగునీటి సౌకర్యాల ఏర్పాటు

## మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్ ప్రారంభం



**ఎల్కతుర్తి/ మార్చి 9 (జర్నలిస్ట్ వార్త):** మిషన్ భగీరథ పథకం లో భాగంగా మండల పరిధిలోని అరెపల్లి గ్రామంలో త్రాగునీటి సౌకర్యాలు కల్పిస్తూ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా జిల్లా ప్రభుత్వ అధికారుల సమక్షంలో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పి. స్రవంతి రాజు మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మిషన్ భగీరథ వాటర్ ప్లానింగ్ కింద త్రాగునీటి సౌకర్యాలతో పాటు పలు అభివృద్ధి పనులను అధికారులు పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించడం ఆనందదాయకమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు, డీఈలు, సూపర్వైజర్లు, ఎంపీడీవో, ఈఓఆర్డీలు, వార్డు సభ్యులు, మహిళా సంఘాల నాయకులు, గ్రామస్తులు మరియు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# చిల్పూర్ దేవస్థానం చైర్మన్ గా పొట్లపల్లి శ్రీధర్ రావు

## .వరుసగా మూడుసార్లు ఎన్నికైన శ్రీధర్ రావు



**స్టేషన్ ఘన్పూర్/ మార్చి9 (జర్నలిస్ట్ వార్త):** రెండవ తిరుపతి గా పేరుగాంచిన చిల్పూర్ మండల కేంద్రంలోని చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గా వరుసగా మూడు సార్లు పొట్లపల్లి శ్రీధర్ రావు ను దేవలయశాఖ కమీషనర్ ప్రకటించారు. ఈ సందర్భంగా పొట్లపల్లి శ్రీధర్ రావు కు దేవాలయం అధికారులు, ప్రజాప్రతినిధులు , నాయకులు, పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పొట్లపల్లి శ్రీధర్ రావు మాట్లాడుతూ స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపి డాక్టర్ కడియం కావ్య, సంబంధిత మంత్రుల సహకారంతో దేవలాయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని అన్నారు. తనకు కృతజ్ఞతలు తెలిపిన ప్రతి ఒక్కరి కి ధన్యవాదాలు తెలిపారు.

# మున్సిపల్ చైర్మన్ ను కలిసిన 18వ వార్డ్ కౌన్సిలర్



**స్టేషన్ ఘన్పూర్/మార్చి9 (జర్నలిస్ట్ వార్త) :** స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ కార్యాలయంలో 18 వ మున్సిపాలిటీ కౌన్సిలర్ పొన్న రవి సోమవారం మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ (సన్నీ) మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వార్డులో ఉన్నసమస్యలు పరిష్కరించాల ని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేష్, రాజు తదిత రులు పాల్గొన్నారు.

# ముల్కనూర్ పీహెచ్‌సీలో మెగా హెల్త్ క్యాంప్

## గ్రామీణ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించనున్న వైద్యులు

**భీమదేవరపల్లి/మార్చి9 (జర్నలిస్ట్ వార్త):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డా. జ్యోత్స్న తెలిపారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డీఎంహెచ్‌వో అప్పయ్య ఆదేశాల మేరకు మార్చి 11, 2026 బుధవారం ఉదయం 10 గంటలకు ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సోమవారం ఆమె వెల్లడించారు. ఈ శిబిరంలో ఆరు విభాగాలకు చెందిన వైద్య నిపుణులు ప్రజలకు వైద్య సేవలు అందించనున్నారని తెలిపారు. గవర్నమెంట్ మెటర్నిటీ, వరంగల్ గాంధీ ఆసుపత్రి వైద్యులు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జనరల్ మెడిసిన్, ఆప్తాల్మాలజీ, డెంటల్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, పీడియాట్రిక్స్ విభాగాలకు చెందిన నిపుణులు వైద్య పరీక్షలు చేసి అవసరమైన చికిత్స అందించనున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డా. జ్యోత్స్న సూచించారు.

# పెనుబల్లి మండలంలో మైనింగ్ తవ్వకాలపై వివాదం

## అనుమతులపై స్పష్టత కోరుతున్న ప్రజలు రైతుల ఆందోళన





**పెనుబల్లి/మార్చి 9 (జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని పెనుబల్లి మండలం ఉప్పలచిలక గ్రామ శివారులో జరుగుతున్న మైనింగ్ తవ్వకాలపై స్థానిక ప్రజల్లో వివిధ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రాంతంలో జరుగుతున్న తవ్వకాలు నిబంధనలకు అనుగుణంగా జరుగుతున్నాయా అనే విషయంపై ప్రజలు స్పష్టత కోరుతున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం, తవ్వకాల కోసం ఇచ్చిన అనుమతుల పరిమితికి మించి లోతులో తవ్వకాలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఇది ఏజెన్సీ ప్రాంతం కావడంతో గిరిజనేతరులకు అనుమతులు ఎలా మంజూరయ్యాయి అనే అంశంపై కూడా చర్చ జరుగుతోంది. దీనిపై సంబంధిత అధికారులు వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ తవ్వకాలపై పర్యవేక్షణ చేయాల్సిన రెవెన్యూ, ఫారెస్ట్, మైనింగ్ శాఖల అధికారులు పరిస్థితిని పరిశీలించి వాస్తవాలు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతుల మేరకే తవ్వకాలు జరుగుతున్నాయా, ఎంత మేరకు లీజులు మంజూరు అయ్యాయి అనే విషయాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇక మరోవైపు మైనింగ్ మరియు క్రషర్ కార్యకలాపాల వల్ల చుట్టుపక్కల గ్రామాల్లో దుమ్ము, ధూళి పెరిగి వాయు కాలుష్యం ఏర్పడుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని ప్రభావం రైతులు సాగు చేస్తున్న వరి, పొగాకు, పత్తి, మిరప పంటలతో పాటు మామిడి తోటలపై పడుతోందని చెబుతున్నారు. పంటల దిగుబడులు తగ్గుతున్నాయని రైతులు వాపోతున్నారు.

అలాగే తవ్వకాల ప్రభావంతో భూసారం తగ్గిపోవడం, జల వనరులపై ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. ఈ సమస్యలపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు రైతులు సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలు తెలియజేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖలు స్థలాన్ని పరిశీలించి వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు అభ్యర్థిస్తున్నారు.

# ఏలుకుర్తి పాఠశాల ఆకస్మిక తనిఖీ

## నరసింగరావుపల్లిలో మూతపడిన బడి పునఃప్రారంభంపై చర్చ






**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో మార్చి 9: (జర్నలిస్ట్ వార్త)** ధర్మసాగర్ మండలంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఏలుకుర్తిను అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యా బోధన, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాల పరిస్థితిని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. తదుపరి నరసింగరావుపల్లి గ్రామాన్ని సందర్శించిన అధికారులు అక్కడ మూతపడిన ప్రాథమిక పాఠశాల పరిస్థితిపై గ్రామ సర్పంచ్‌తో పాటు గ్రామస్తులను అడిగి వివరాలు సేకరించారు. విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడం వల్ల పాఠశాల మూతపడినట్లు స్థానికులు తెలిపారు. రానున్న 20262027 విద్యా సంవత్సరానికి పాఠశాల మళ్లీ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ రూపొందించాలని గ్రామస్తులతో చర్చించారు. విద్యార్థులను సమీప పాఠశాలలకు వెళ్లాల్సిన ఇబ్బందులు ఎదురవుతున్నందున బడి తిరిగి ప్రారంభించాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు కోరారు. పాఠశాల పునఃప్రారంభానికి అవసరమైన వివరాలను సేకరించి సంబంధిత అధికారులకు నివేదించనున్నట్లు అధికారులు తెలిపారు.

# వ్యవసాయ యంత్రికరణకు ఊతం

## రూ.2 కోట్ల బడ్జెట్‌లో సబ్సిడీ యంత్రాల పంపిణీ

## -రైతులు యాంత్రిక పద్ధతులు అవలంబించాలి: ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**ధర్మసాగర్,/వేలేరు/హనుమకొండ బ్యూరో మార్చి 9 (జర్నలిస్ట్ వార్త):** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ యంత్రికరణకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్నాయని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రైతులకు 50 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు అందిస్తున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ధర్మసాగర్ మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్సిడీపై వ్యవసాయ యంత్రాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా స్థాయిలో కేటాయించిన రూ.2 కోట్ల వ్యవసాయ యంత్రాల బడ్జెట్‌లో భాగంగా ధర్మసాగర్, వేలేరు మండలాలకు యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని 12 మంది లబ్ధిదారులకు రోటోవేటర్లు, బేలర్లు, స్ప్రేయర్లు వంటి యంత్రాలను 50 శాతం సబ్సిడీపై అందజేశారు.

ధర్మసాగర్ మండలానికి రూ.13.50 లక్షల బడ్జెట్ కేటాయించగా, వేలేరు మండలానికి రూ.5.31 లక్షల బడ్జెట్ మంజూరైంది. ధర్మసాగర్ మండలంలోని



రైతులకు 5 రోటోవేటర్లు, 2 బేలర్లు పంపిణీ చేయగా, వేలేరు మండలంలో 1 బేలర్, 3 రోటోవేటర్లు, 1 కల్టివేటర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయం లాభసాటిగా మారడం లేదని, పెట్టుబడి భారం రైతులపై పెరుగుతోందని అన్నారు. రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు యంత్రికరణకు ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు యాంత్రిక పద్ధతులను అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు కేవలం వరి పంటపైనే ఆధారపడకుండా వాణిజ్య పంటల వైపు కూడా మొగ్గు చూపాలని సూచించారు. అలాగే వ్యవసాయంతో పాటు పాడి, పౌల్ట్రీ వంటి అనుబంధ రంగాలపై దృష్టి పెట్టడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. ధర్మసాగర్, వేలేరు మండలాలు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడిన ప్రాంతాలని, అందువల్ల సబ్సిడీ యంత్రాల కేటాయింపులో ఈ రెండు మండలాలకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారులను కోరారు.

డ్రోన్ స్ప్రేయర్లను వ్యక్తులకు కాకుండా రైతు సంఘాలు లేదా మహిళా సంఘాలకు గ్రామానికి ఒక్కటి చొప్పున కేటాయించాలని సూచించారు. రైతులు పండించిన పంటకు సరైన ధర అందడం లేదని, వ్యవసాయం ఇంకా లాభసాటిగా మారలేదని పేర్కొన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను యథాతథంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, అదనపు వ్యవసాయ సంచాలకులు ఆదిరెడ్డి, మండల వ్యవసాయ అధికారులు రాజేష్, కవిత, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.